తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
07-05-2024
మంగళవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 259 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక జయభేరి చానల్లో నికార్సైన జర్నలిస్టులుగా నిలబడాలను కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889



## రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగిస్తాం

**జయభేరి, భూపాల్ మే 6 :**


కుల ఆధారిత రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం గరిష్ఠ పరిమితిని తొలగించి దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరి జనులకు రిజర్వేషన్ల కోటాను కాంగ్రెస్ పెంచుతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని రత్నాంలో ఒక ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఈ ఎన్నికల్లో పోరాడుతున్నామని చెప్పారు.రాజ్యాంగాన్ని అంతం చేయాలని, మార్చాలని బిజెపి, ఆర్‌ఎస్ఎస్ ఆలోచిస్తున్నాయని ఆయన ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు. జల్ (నీరు), జంగల్ (అడవులు), జమీన్(భూమి)పై రాజ్యాంగం మీకు హక్కు ఇచ్చిందని, ఆ హక్కులను తొలగించాలని, సంపూర్ణ అధికారం తన వద్దనే ఉంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారని చేతిలో రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని రాహుల్ ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బిజెపి నాయకులు చెబుతున్నారని ఆయన అన్నారు. ఈ కారణంగానే 400కి మించి సీట్లు కావాలంటూ బిజెపి నాయకులు నినాదాలు ఇస్తున్నారని, అయితే 400 మాట అటుంచి కనీసం 150 సీట్లు కూడా ఆ పార్టీకి రావని ఆయన జోస్యం చెప్పారు. రిజర్వేషన్లు తొలగిస్తామని వారు అంటున్నారని, కాని 50 శాతానికి మించి మీకు రిజర్వేషన్లు పెంచుతామని తాను ఈ వేదిక నుంచి హామీ ఇస్తున్నానని రాహుల్ తెలిపారు.పేదలు, వెనుకబడిన వర్గాలు, దళితులు, ఆదివాసీలకు అవసరమైన మేరకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఆయన తెలిపారు. ఆదివాసీలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించిన వార్తలను మీడియా చూపించదని ఆయన ఆరోపించారు. మీ పిల్లలను అత్యాచారం చేస్తారు..మీ భూమిని లాక్కుంటారు..కాని

...మిగతాది 2 లో

## రైతు భరోసా నిధులు విడుదల




రైతులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్.. రూ.2 వేల కోట్లు విడుదల!
రైతు భరోసాపై మాటల యుద్ధం.. పంట నష్టం నిధులు విడుదల
తెలంగాణ ప్రభుత్వం రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఐదు ఎకరాల పైబడిన రైతులకు రైతు భరోసా నిధులు జమ చేసింది. రైతుల అకౌంట్లలో నగదు జమ అవుతున్నాయి.



## దేశవ్యాప్తంగా యూసీసీ

**జయభేరి, న్యూఢిల్లీ, మే 6:**

దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (UCC)ని అమలుచేసిన తొలి రాష్ట్రం ఉత్తరాఖండ్ అని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి అన్నారు. దేశమంతా యూసీసీ అమలు కోసం ఎదురుచూస్తోందని.. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక దేశ వ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి అమలు చేసి తీరతామని స్పష్టం చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గం కసిష్ ఫంక్షన్ హాల్ లో యువమోర్చా సమ్మేళనంలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పుష్కర్ సింగ్ దామి మాట్లాడుతూ.. ఉత్తరాఖండ్ దేవ భూమి అని, తమ పుణ్యభూమికి ఎవరైనా రావొచ్చు అని తెలుగు ప్రజలను ఆహ్వానించారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. నేడు దేశమంతా మోదీ వైపు చూస్తోందన్నారు. మోదీకి సరిపోయే వ్యక్తి కోసం భూతద్దం చూసి వెతికినా దేశంలో ఎక్కడా కనిపించడం లేదన్నారు. యువశక్తి మన ప్రధాన బలం అని, మన యువతే మోదీ భవిష్యత్ భారత నిర్మాణంలో కీలకంగా మారనున్నారు. యువత పెద్ద సంఖ్యలో బీజేపీకి ఓట్లు వేసి తమ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రధాని మోదీ ఎజెండా అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో ఎక్కువ స్థానాలు గెలిచేది బీజేపీ అన్నారు. వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్ లలో బీజేపీ పెద్దలు ప్రచారం చేయగా, తాను సైతం

...మిగతాది 2 లో



## ఎమ్మెల్సీ కవితకు మళ్ళీ షాక్

**జయభేరి, న్యూఢిల్లీ, మే 6**

ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బిగ్ షాక్ తగిలింది. ఈ కేసుకు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఈడీ, సీబీఐ కేసుల్లో ఆమెకు బెయిల్ ఇచ్చేందుకు రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది. ఆమెకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ న్యాయమూర్తి జస్టిస్ కావేరి బవేజా సోమవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసుల్లో వేర్వేరుగా కవిత బెయిల్ పిటిషన్లు దాఖలు చేయగా.. న్యాయస్థానం మే 2న తీర్పు రిజర్వ్ చేసింది. ఎన్నికల నేపథ్యంలో స్టార్ క్యాంపెయినర్ ప్రచారంలో పాల్గొనాల్సి ఉందని కవిత పేర్కొన్నారు. మహిళగా పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం బెయిల్ కు అర్హత ఉందన్నారు. ఈ పిటిషన్ పై విచారించిన న్యాయస్థానం బెయిల్ పిటిషన్లను తోసిపుచ్చింది. కాగా, కవిత బెయిల్ పిటిషన్లపై ఏప్రిల్ 22న కోర్టులో వాదనలు జరగ్గా.. తీర్పును మే 2 (గురువారం) కు రిజర్వ్ చేసింది. ఆ రోజు విచారణ సందర్భంగా మే 6వ తేదీకి తీర్పు రిజర్వ్ చేసింది. ఈ కేసులో కవితను మార్చి 15న ఈడీ అరెస్ట్ చేయగా..

...మిగతాది 2 లో

## తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత నీదే..!



**జయభేరి, నిజామాబాద్:**

ఆదివారం జగిత్యాలలో బస చేసిన కేసీఆర్, బస్సు యాత్ర ద్వారా సోమవారం నిజామాబాద్ దిశగా సాగారు. పదుల సంఖ్యలో వాహనాలు, వందలాదిగా నాయకులు కార్యకర్తలతో కూడిన కేసీఆర్ బస్సు యాత్ర కాన్వాయ్., తోవలో ప్రజలను కలుస్తూ వారి కష్టాలను దుఃఖాలను సమస్యలను తెలుసుకుంటూ వారికి భరోసా ఇస్తూ ముందుకు సాగుతోంది. జగిత్యాల లో బస చేసిన కేసీఆర్, స్థానింకంగా నివాసం ఉంటున్న తన చిన్న నాటి గురువు ప్రముఖ కవి జైశెట్టి రమణయ్య వద్దకు వెళ్లి ఆశీర్వాదం

...మిగతాది 2 లో



## నీకు నాకు ఏంటి పోలిక బిడ్డ..

మేడ్చల్ మున్సిపాలిటీలో ఈటల రాజేందర్ రోడ్ షో..

**మేడ్చల్ :**

ఇదే రేవంత్ రెడ్డి ఆనాడు సమైక్యవాదాన్ని వినిపించిండు, వాళ్ల సంకలో చేరిండు. ఉద్యమకారుల మీద తుపాకీ తీశాడు. అందుకే నీకు నాకు ఏంటి పోలిక బిడ్డ... రేవంత్ రెడ్డి... నీకు నిజంగా దమ్ముంటే, ప్రజల పట్ల ప్రేమ ఉంటే ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చు. మల్కాజ్గిరి కి ఐదేళ్లు

...మిగతాది 2 లో

## దూకుడు పెంచిన కేటీఆర్



**జయభేరి, హైదరాబాద్, మే 6:**

లోక్ సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) దూకుడు పెంచింది. ఓ వైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. మరోవైపు కేటీఆర్, హరీష్‌రావు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఈక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాక్యలు చేశారు. పదేళ్ల నిజం కేసీఆర్, పదేళ్ల విషం బీజేపీ, వంద రోజుల అబద్ధం కాంగ్రెస్..

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రైతు భరోసా నిధులు విడుదల

తెలంగాణ రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసింది. దీంతో రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ అవుతున్నాయి. ఐదు ఎకరాల పైబడిన రైతులకు రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. రైతు భరోసా కింద రూ.2 వేల కోట్లకు పైగా నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే రైతు భరోసా నిధులను వ్యవసాయశాఖ సోమవారం సాయంత్రం విడుదల చేసింది. ఇప్పటి వరకు ఐదు ఎకరాలలోపు రైతులకు నిధులు జమ చేయంగా, సోమవారం నుంచి ఐదు ఎకరాలు పైబడిన రైతులకు నిధులు ఖాతాల్లో జమ చేస్తున్నారు. రైతు భరోసా కోసం ప్రభుత్వం దాదాపు రూ.2 వేల కోట్ల నిధులను విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల వేళ రైతు భరోసా నిధుల విడుదల కాంగ్రెస్ ప్రభుత్వానికి కీలకంగా మారింది. రైతు భరోసా నిధులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం జరిగింది. మే 9వ తేదీలోపు రైతు భరోసా నిధులు విడుదల చేయకపోతే సీఎం ముక్కు నేలకు రాస్తానంటూ సీఎం రేవంత్ రెడ్డి ఛాలెంజ్ చేశారు. నిధులు విడుదలైతే కేసీఆర్ ముక్కు నేలకు రాయాలంటూ సవాల్ విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని, కనీసం బీఆర్ఎస్ ఇచ్చిన రైతు బంధు రూ. 10 వేలు కూడా ఖాతాల్లో వేయలేదని బీఆర్ఎస్... కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసింది. కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా సమయానికి నిధులు పడ్డాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు బంధు ఆగిపోయిందని కేసీఆర్ విమర్శలు చేశారు. లోక్ సభ ఎన్నికల వేళ కేసీఆర్, బీఆర్ఎస్ విమర్శల వేగం పెంచడంతో కాంగ్రెస్ అలర్ట్ అయ్యింది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌కు కౌంటర్లు ఇచ్చారు. మే 9లోపు రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో తాజాగా ఈసీ అనుమతి లభించడంతో రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. తెలంగాణలో అకాల వర్షాలు, కరవు పరిస్థితులతో పంట నష్టపోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రాష్ట్రంలో పంట నష్టపోయిన రైతులకు పంట నష్టం నిధులును ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. పంట నష్టం నిధులు విడుదలకు ఈసీ అనుమతించడంతో ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15,814 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. 15,246 మంది రైతులకు రూ. 15.81 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో 10 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వం తెలిపింది.

## రిజర్వేషన్లపై 50 శాతం..

మీడియా ఈ వార్తలను రాయదు. ఇందుకు కారణం ఉంది. ఈ మీడియా కంపెనీలలో ఆదివాసీలు లేరు అని రాహుల్ ఆరోపించారు. దేశంలోని ప్రభుత్వాన్ని 90 మంది బ్యూరోక్రాట్లు నడుపుతున్నారని ఆయన చెప్పారు. బడ్జెట్‌లను వారే పంపిణీ చేస్తారు. 90 మందిలో ఒకరే ఆదివాసీ. ముగ్గురు వెనుకబడిన తరగతులకు చెందిన వారు. దళిత వర్గాలకు చెందిన వారు ముగ్గురు. మీకు చెందిన వారు మీడియాలో కాని కార్పొరేట్ ప్రపంచంలో కాని లేరు. దీన్ని మార్చాలని మేము భావిస్తున్నాము. అందుకే కులగణన, ఆర్థిక సర్వే జరిపించాలని నిర్ణయించుకున్నాము అని రాహుల్ తెలిపారు. రైతులకు వారి పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని, రుణ మాఫీ చేస్తామని ఆయన వాగ్దానం చేశారు. తాము ఇస్తున్న హామీలు ఇవేనని, వీటితో మీ జీవితాలు మార్చివేస్తామని ఆయన ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల నాలుగవ దశలో మే 13న రత్లాంలో పోలింగ్ జరగనున్నది. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి కాంతిలాల్ భూరియా పోటీ చేస్తుండగా బిజెపి తరపున అనితా నగర్ సింగ్ చౌహాన్ పోటీ చేస్తున్నారు.

## దేశవ్యాప్తంగా యూసీసీ

తెలంగాణలో పలు కార్యక్రమాల్లో పాల్గొనట్లు చెప్పారు. ఎటు చూసినా బీజేపీ, మోదీ వైపు ప్రజలు చూస్తున్నారని.. కేంద్రంలో వచ్చేది తమ ప్రభుత్వమే అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీజేపీ హవా నడుస్తోందని, I.N.D.I.A కూటమిలో ప్రధాని అయ్యే వ్యక్తి ఎవరూ లేరని పుష్కర్ సింగ్ ధామి కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీకి రాజకీయాలు సరిగ్గా అర్థం కావడం లేదని, ఆ పార్టీ నేతలకు ఏకాభిప్రాయం ఉండదన్నారు. యువత భవిష్యత్ కోసం, దేశ రక్షణ కోసం నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని కావాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆకాంక్షించారు. దేశం కోసం తాను ప్రధానిగా ఉండాలని మోదీ భావిస్తే, తన కుటుంబం కోసం, తన కోసం ప్రధాని పదవి కోరుకుంటున్న వ్యక్తి రాహుల్ గాంధీ అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ లో జరగనున్న బీజేపీ భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున యువత తరలి రావాలని పిలుపునిచ్చారు కిషన్ రెడ్డి. ప్రధాని మోదీ సభకు తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. వయోజనులు అంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని, నరేంద్ర మోదీని మరోసారి ప్రధాని కావాలంటే బీజేపీకి ఓటేయాలన్నారు. దేశంలో శాంతి కొనసాగాలన్నా, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలన్నా బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలన్నారు.

## రాష్ట్రాన్ని సాధించిన ఘనత నీదే..!

తీసుకున్నారు. వయోభారం తో అనారోగ్యం తో విశ్రాంతి తీసుకుంటున్న వారిని కేసీఆర్ పరామర్శించారు. రమణయ్య కుటుంబ సభ్యులు కేసీఆర్ ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తాను ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో సిద్దిపేట జూనియర్ కాలేజీలో హిస్టరీ లెక్చరర్ గా తనకు చరిత్ర పాఠాలు నేర్పిన నాటి జ్ఞాపకాలను కేసీఆర్ నెమరువేసుకున్నారు. ఇంతింతై వటుడింతయ్ అన్నట్టుగా ఎదిగిన తన ప్రియ శిష్యుణ్ణి చూసిన గురువు రమణయ్య ఎంతగానో సంబురపడ్డారు. తెలంగాణ ప్రజల పట్ల ఆనాటి నుంచి కేసీఆర్ కున్న శ్రద్ధ ను ఈ సందర్భంగా ఆ పెద్దమనిషి ప్రస్తావించారు. సిద్దిపేట జిల్లా కావాలని 30 ఏండ్లకిందనే కేసీఆర్ నాటి కేంద్ర మంత్రికి వినతిని అందించిన విషయాన్ని గురువు రమణయ్య గుర్తుచేశారు. ప్రజలను చైతన్యం చేసి ఉద్యమానికి నాయకత్వం వహించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత నీదేనని తన శిష్యుడు కేసీఆర్ ను కొనియాడారు రమణయ్య. సాధించిన రాష్ట్రాన్ని అనతికాలంలోనే అభివృద్ధి చేసి తెలంగాణ ఔన్నత్యాన్ని దేశంలో నిలిపావని మెచ్చుకున్నారు. కష్టాలను నష్టాలను సుఖాలను బాధలను జయాలను అపజయాలను సమ స్థితిలో స్వీకరించడం కేసీఆర్ కు చిన్ననాటినుండీ అలవాటేనని అదే ఆయన విజయాలకు మూలమని, అదే స్థితప్రజ్ఞతను కొనసాగిస్తూ భవిష్యత్తులో విజయాలు సాధిస్తూ తెలంగాణ ప్రజల కన్నీళ్లు తూడ్చడంలో ముందుండాలని, తెలంగాణ ప్రజల సంక్షేమానికి ఇంకా చాలా చేయాల్సి ఉన్నదని తన శిష్యునికి రమణయ్య ఉద్బోధించారు. తనను పరామర్శించడానికి వచ్చిన శిష్యుడు కేసీఆర్ తో పావుగంట పాటు ఇష్టాగోష్టి కొనసాగించారు. అనంతరం గురువు వద్ద మరోసారి ఆశీర్వాదం వీడ్కోలు తీసుకుని తన పదమూడో రోజు బస్సు యాత్రను కొనసాగించేందుకు కేసీఆర్ ముందుకు కదిలారు. బస్సు యాత్ర నిజామాబాద్ దిశగా కొనసాగుతోంది.

## ఎమ్మెల్సీ కవితకు మళ్ళీ షాక్


ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ క్రమంలో ఆమె 2 బెయిల్ పిటిషన్లు వేశారు. ప్రస్తుతం ఆమె జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తీహార్ జైలులో ఉన్నారు. ఏప్రిల్ 22న విచారణ సందర్భంగా కవిత బెయిల్ పిటిషన్లపై ఆమె తరపు లాయర్లతో పాటు ఈడీ, సీబీఐ తరపున లాయర్లు సైతం వాదనలు వినిపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే కవితను అరెస్ట్ చేశారని.. ఈడీ కస్టడీలో ఉండగానే సీబీఐ ఆమెను అరెస్ట్ చేసిందని కోర్టుకు ఆమె తరపున న్యాయవాది సింఘ్వి వాదించారు. బీఆర్ఎస్ కు కవిత స్టార్ క్యాంపెయినర్ అని ఆమెకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. 'మహిళగా కల్వకుంట్ల కవిత బెయిల్‌కు అర్హురాలు. ఆమె అరెస్ట్ నుంచి విచారణ వరకు ఎటువంటి సాక్ష్యం లేదు. కవిత అరెస్ట్‌కు సరైన ఆధారాలు లేవు. ఆధారాలు లేకుండానే కవితను అరెస్ట్ చేశారు' అంటూ కోర్టుకు తెలిపారు. ఈడీ కస్టడీలో ఉండగానే ఎందుకు సీబీఐ అధికారులు ఆమెను అరెస్ట్ చేశారని.. అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని అన్నారు. తమ రాజకీయ పార్టీకి కవిత స్టార్ క్యాంపెయినర్ అని.. ఇప్పుడు ఆమె ప్రతిపక్షంలో ఉన్నారని వాదించారు. ఆమె పార్టీ రూలింగ్‌లో ఉన్నప్పుడే కేసును ప్రభావితం చేయలేదని గుర్తు చేశారు. ఏడేళ్ల లోపల పడే శిక్ష ఉన్న కేసులో అరెస్ట్ అవసరం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, దీనిపై ఈడీ, సీబీఐ తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. కవితకు బెయిల్ ఇస్తే.. సాక్షులను ప్రభావితం చేస్తారని చెప్పారు. ఈ కేసులో ఆమె కీలక సూత్రధారి అని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సాక్ష్యాలను ధ్వంసం చేసే అవకాశం కూడా ఉందని కోర్టుకు తెలిపారు. ఈ కేసులో కవిత కింగ్ పిన్ అని.. కవితకు బెయిల్ ఇవ్వొద్దని అన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం.. ఈడీ, సీబీఐ వాదనలతో ఏకీభవిస్తూ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది.

# పెద్దపల్లిలో పాగా వేసేది ఎవరు

**పెద్దపల్లిలో రాజకీయంగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ కంచుకోటలో పాగా వేసేందుకు బిఆర్ఎస్, బీజేపి ప్రయత్నిస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీకి చెక్ పెట్టి కొత్త అభ్యర్థిని గులాబీ దళపతి కేసీఆర్ బరిలోకి దింపగా, కాంగ్రెస్ ఆర్థికంగా బలమైన వ్యక్తిని, బిజేపి సామాజికంగా అంశాన్ని పరిగణలోకి తీసుకుని సరికొత్త అభ్యర్థిని పోటీలో పెట్టింది. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలతో పాటు 42 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బిజేపీ నుంచి గోమాస శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ కు కంచుకోటగా ఉన్న పెద్దపల్లి... తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక టిఆర్ఎస్ కు అడ్డాగా మారింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కేంద్రంలో బిజేపి, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా సిట్టింగ్ స్థానం బిఆర్ఎస్ ది కావడం.. ఈసారి ఎక్కువ మంది పోటీ చేస్తుండడంతో ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే చర్చ సాగుతుంది.**

✍ జయభేరి, కరీంనగర్, మే 6:

ఎత్తుకు పైఎత్తులతో దూకుడు పెంచిన మూడు ప్రధాన పార్టీలు గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. వెలుగులు విరజిమ్మే ఎన్టీపీసీ, సిరుల మాగాణి సింగరేణి తో ముడిపడి ఉన్న పెద్దపల్లి పార్లమెంట్ పాలిటిక్స్ హాట్ టాపిక్ గా మారాయి. ఎస్సీ రిజర్వుడు స్థానమైన పెద్దపల్లిలో పార్లమెంట్ ఎన్నికల రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. నాలుగు జిల్లాల్లో విస్తరించిన పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సెంటర్ అట్రాక్షన్ గా నిలుస్తుంది. పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో ఏర్పడిన ఈ పార్లమెంట్ నియోజకవర్గం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరుగగా 9 సార్లు కాంగ్రెస్, మూడుసార్లు టిడిపి, రెండు సార్లు టిఆర్ఎస్ ఒకసారి తెలంగాణ ప్రజాసమితి గెలిచాయి. కానీ బిజేపి మాత్రం ఒక్కసారి కూడా గెలువలేదు. కనీసం రెండో స్థానానికి సైతం రాలేదు. బీజేపీకి ప్రాతినిధ్యం లేని నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి ట్రై యాంగిల్ ఫైట్ జరుగుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బిఆర్ఎస్ మూడు పార్టీలు ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తూ కథన రంగంలోకి దుకారు. గెలుపే లక్ష్యంగా అధికార, విపక్ష పార్టీలు పావులు కదుపుతున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు బిఆర్ఎస్ కసరత్తు చేస్తుండగా, అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ ఎంపీ స్థానాన్ని చేజిక్కించుకునేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంది. ఇక బిజెపి... మోడీ నామా జపంతో సత్తా చాటుకునేందుకు యత్నిస్తుంది. మూడు ప్రధాన పార్టీలు ఎత్తుకు పైఎత్తులతో కొత్త ముఖాలను, సరికొత్త అభ్యర్థులను తెరపైకి తెచ్చి సత్తా చాటే పనిలో నిమగ్నమయ్యాయి. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిజెపి(BJP), బిఆర్ఎస్ శక్తియుక్తులను ప్రదర్శిస్తున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 15 లక్షల 92 వేల 996 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 805755 మంది కాగా పురుష ఓటర్లు 787140 మంది, ట్రాన్స్ జెండర్స్ 101 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఏడింటిని కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 12 లక్షల 25 వేల 768 ఓట్లు పోల్ కాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కు 6 లక్షల 82 వేల ఓట్లు రాగా బిఆర్ఎస్ కు 3 లక్షల 74 ఓట్లు లభించాయి. బిజెపికి కేవలం 79 వేల ఓట్లు మాత్రమే లభించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లు చూస్తే బిఆర్ఎస్ కంటే కాంగ్రెస్ కు మూడు లక్షల ఏడు వేల 670 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. సిట్టింగ్ ఎంపీగా ఉన్న బిఆర్ఎస్ నేత వెంకటేష్‌కు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 4 లక్షల 41 వేల 321 ఓట్లు దక్కాయి. నాలుగున్నరేళ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ కంటే కాంగ్రెస్ కు 3 లక్షల ఏడు వేల ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఓట్ల శాతాన్ని చూసి ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కే అనుకూల ఫలితం వస్తుందని భావిస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 1989, 1991, 1996 లో వరసగా మూడు సార్లు కాంగ్రెస్ నుంచి జి వెంకటస్వామి ఎంపీగా గెలుపొందారు. 1998, 1999 లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన సుగుణకుమారి చేతిలో వెంకటస్వామి ఓటమిపాలయ్యారు. తిరిగి వెంకటస్వామి 2004లో కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. 2009 వెంకటస్వామి రాజకీయ రిటైర్మెంట్ తీసుకూని కుమారుడు వివేక్ వెంకటస్వామి బరిలోకి దింపగా 2009లో వివేక్ కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచి పార్లమెంటులో తొలిసారి అడుగు పెట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో వివేక్, టిఆర్ఎస్ నుంచి పోటీ చేసిన బాల్క సుమన్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2019లో వివేక్ పోటీ చేయలేకపోయారు. ఆ సమయంలో టిఆర్ఎస్ నుంచి వెంకటేష్ నేత, కాంగ్రెస్ నుంచి ఆగం చంద్రశేఖర్, బిజెపి నుంచి ఎస్.కుమార్ పోటీ చేయగా 95 వేల ఓట్ల మెజార్టీతో వెంకటేష్ నేత గెలుపొందారు. ప్రస్తుతం మూడు ప్రధాన పార్టీలు తక్కువే కాదన్నట్లు వ్యవహరించడంతో తాజా రాజకీయాలు రక్తికట్టిస్తున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం సాగుతుంది. విమర్శలు.. ఆరోపణలు.. సవాళ్ళు ప్రతిసవాళ్ళతో ప్రజల్ని ఆకర్షించేందుకు కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ పోటీ పడుతున్నాయి. పోటీలో 42 మంది అభ్యర్థులు ఉన్నప్పటికి ప్రధానంగా పోటీ మాత్రం కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్యనే కొనసాగుతుంది పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి ప్రస్తుతం ఎంపీ గా వెంకటేష్ నేత కొనసాగుతున్నారు. గత 2019 ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి గెలిచిన వెంకటేష్ నేత గత రెండు మాసాల క్రితం బిఆర్ఎస్ టిక్కెట్ లభించదని భావించి కారు దిగి కాంగ్రెస్ లో చేరారు. కానీ చివరకు టిక్కెట్ లభించకపోవడంతో నామినేషన్ ల చివరి రోజు కాంగ్రెస్ కు సైతం గుడ్ బై చెప్పి బిజెపిలో చేరాడు. అయన కథ అక్కడితో ముసిగిపోగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలుచుకోలేకపోయినా సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని కాపాడుకునేందుకు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీ కి చెక్ పెట్టి మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ను బరిలోకి దింపారు. ఇక కాంగ్రెస్ కు కంచుకోటైన పెద్దపల్లి లో పూర్వవైభవాన్ని చాటుకునేందుకు ఆ పార్టీ యత్నిస్తుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి, మంథని, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి ఏడు అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్... పార్లమెంట్ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఆర్థికంగా సామాజికంగా బలమైన అభ్యర్థి కోసం అన్వేషించి మాజీఎంపీ స్వర్గీయ వెంకటస్వామి తనయుడు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుమారుడు గడ్డం వంశీకృష్ణను బరిలోకి దింపింది. ఇప్పటికి వరకు 15 సార్లు ఎన్నికలు జరుగగా అందులో 9 సార్లు కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. అందులో వెంకటస్వామి నాలుగు సార్లు, ఆయన కుమారుడు వివేక్ ఒకసారి ఎన్నికయ్యారు. వంశీ తండ్రీ వివేక్ చెన్నూరు నుంచి, పెద్దనాన్న వినోద్ బెల్లంపల్లి నుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. మంథని నుంచి మంత్రి శ్రీధర్ బాబు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ చార్జీగా వ్యవహరిస్తున్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సైతం ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో తమ సత్తాను చాటుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుంది. ఆ పార్టీ నుంచి నేతకాని సామాజిక వర్గానికి చెందిన గోమాస శ్రీనివాస్ ను పోటీలో నిలిపింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సామాజిక పరంగా నేతకాని ఓట్లు ఎక్కువగా ఉండడంతో వ్యూహాత్మకంగా బిజెపి ఎన్నికల ముందు శ్రీనివాస్ ను కాంగ్రెస్ నుంచి బిజెపిలో చేర్చుకుని టిక్కెట్ ఇచ్చింది. టిక్కెట్ ఇచ్చిన తర్వాత శ్రీనివాస్ ప్రచారం చేయకపోవడంతో అభ్యర్థిని మార్చుతారనే ప్రచారం జరగడంతో కాంగ్రెస్ నుంచి టిక్కెట్ అశించి భంగపడ్డ సిట్టింగ్ ఎంపి వెంకటేష్ నేత బిజెపిలో చేరేందుకు యత్నించారు. అప్రమత్తమైన శ్రీనివాస్ ప్రచారం చేపట్టడం.. వెంకటేష్ నేత చేరిక ఆలస్యం కావడంతో చివరకు బిజెపి శ్రీనివాస్ నే కొనసాగించింది. కేవలం నరేంద్ర మోడీ చరిష్మాతో ఎన్నికల బరి లోకి దిగి సత్తా చాటాలనే లక్ష్యంతోనే బిజెపి పోటీ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఆ పార్టీ నాయకుల వ్యూహం ఎలా ఉన్నా పెద్దపల్లిలో బిజెపి పోటీ ఆసక్తికరంగా మారింది.



## నీకు నాకు ఏంటి పోలిక బిడ్డ..

ఎంపీగా ఉన్నావు.. మేడ్చల్కు ఒక రోడ్డు అన్న వేసావా, ఒక మోరి అన్న కట్టించావా... అసలు ఇక్కడ ప్రజలకు కనపడ్డాడా, పోనీ పార్లమెంట్లో మల్కాజ్గిరి సమస్యలపై ప్రశ్నించావా... నువ్వు ఈటల రాజేందర్ ఎవరు అంటావా? ఈ మేడ్చల్ రోడ్డు ఒక వేదన చూసింది. కరోనా వచ్చినాడు మనందరం ఇదే ఇళ్లల్లో బిక్కుబిక్కుమంటూ బయటకు వెళ్లకపోతే... యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రజలు వేలాది మంది ఇదే రోడ్ల మీద ఎర్రటి ఎండలో వాళ్ళు నడుచుకుంటూ పోతుంటే కళ్లల్లో నీళ్లు వచ్చినాయి. ఎందుకు వెళ్తున్నారని మేము అడిగితే... కరోనా వచ్చి చచ్చిపోతే మా మట్టిలోనే చచ్చిపోతామని వారు చెప్పారు.

రేవంత్ రెడ్డి పోచంపల్లి లో మీటింగ్ పెట్టి ఈ ఈటలకు మేడ్చల్ కు ఏంటి సంబంధం అంటున్నాడు.. రేవంత్ రెడ్డికి మేడ్చల్ కు సంబంధం ఉందా.. తెలంగాణ ఉద్యమంలో 14 సంవత్సరాలు రాజీపడకుండా పోరాటం చేసిన బిడ్డ ఈటల రాజేందర్. ఇదే రేవంత్ రెడ్డి ఆనాడు సమైక్యవాదాన్ని వినిపించిండు, వాళ్ల సంకలో చేరిండు. ఉద్యమకారుల మీద తుపాకీ తీశాడు. అందుకే నీకు నాకు ఏంటి పోలిక బిడ్డ... రేవంత్ రెడ్డి... నీకు నిజంగా దమ్ముంటే, ప్రజల పట్ల ప్రేమ ఉంటే ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చు. మల్కాజ్గిరి కి ఐదేళ్లు ఎంపీగా ఉన్నావు.. మేడ్చల్కు ఒక రోడ్డు అన్న వేసావా, ఒక మోరి అన్న కట్టించావా... అసలు ఇక్కడ ప్రజలకు కనపడ్డాడా, పోనీ పార్లమెంట్లో మల్కాజ్గిరి సమస్యలపై ప్రశ్నించావా... నువ్వు ఈటల రాజేందర్ ఎవరు అంటావా. ఈటల రాజేందర్ నలుగురు ముఖ్యమంత్రులతో కొట్లడిండు. అసెంబ్లీలో రాజశేఖర్ రెడ్డి రాజేంద్ర నీ తలకాయ ఎక్కడ పెట్టుకుంటావు అన్నాడు, ఛాలెంజ్ చేసి అదే అసెంబ్లీలో లక్ష కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిండు ఈటల రాజేందర్. మరో ముఖ్యమంత్రి ఒక్క రూపాయి కూడా ఇవ్వని పో అన్నాడు, నేను ఒకటే అన్నాను... మిస్టర్ ముఖ్యమంత్రి, ఈ రాష్ట్రానికి నువ్వు జీతగాడివి తప్ప ఓనర్వి కాదు అని.. మొన్న దిగిపోయిన ముఖ్యమంత్రికి మంత్రులుగా గుర్తించకు మనిషిగా గుర్తించు అని చెప్పిన. మంత్రులకు కూడా మెదడు ఉంటదని భావించు ముఖ్యమంత్రి, అహంకారం పనికిరాదు అని చెప్తే రకరకాల పేపర్లో రాతలు రాయించి, ప్రగతి భవన్ నుండి వెళ్ళగొట్టిన నాడు... నేను ఒకటే చెప్పిన జెండాకు ఓనర్లు ఈటల రాజేందర్ అని. పదవుల కోసం పెదవులు ముయ్యలేదు.

పదవిని గడ్డి పోచలాగా మొహం మీద విసిరేసి మళ్లీ కురుక్షేత్ర యుద్ధంలో నెగ్గిన బిడ్డ ఈటల రాజేందర్. మీకు ఎన్ని హామీలు అయితే ఈ ప్రభుత్వం ఇచ్చిందో... ఆ ప్రభుత్వం గనుక అమలు చేయకపోతే, ప్రభుత్వం మీద కొట్లాడే బిడ్డ, మీ పక్షాన నిలిచే బిడ్డ ఈటలనే ఉంటాడని మర్చిపోవద్దు. నాలాంటోడు రేపు ఎంపీ అయితే మేడ్చల్ కు మెట్రో రైల్ వస్తది. మేడ్చల్ కు ఇవాళ ఈ ఫ్లైఓవర్ ఇస్తుంది మోడీ గారు. రేపు అల్వాల్ కు ఫ్లైఓవర్ ఇచ్చేది కూడా మోడీ.

తెలంగాణ లో 100 కోట్లు భూమి అమ్మిన నాడు కెసిఆర్ సంబరపడ్డాడు.. కానీ కంపెనీలలో 1012 వేల రూపాయలకు కష్టం చేసే పేదవాడు ఇల్లు కట్టగలుగుతాడా.. పిల్లలు చదివించడానికే పైసలు లేవు, ఏ పూటకు ఆ పూటే కూలి దొరకకపోతే నకనకలాడే వారు అలాంటి పేదల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. రేపు కచ్చితంగా పేదవాళ్లకు డబుల్ బెడ్ రూంలో కట్టించే బాధ్యత మాకు అప్పజెప్పాలని కోరుతున్నాను. మల్కాజ్గిరి లో ఐటీ హబ్ రావాలన్న, ఇండస్ట్రియల్ పార్క్ రావాలన్న, సిమెంట్ రోడ్లు రావాలన్నా, డ్రైనేజ్ సిస్టం రావాలన్నా, పిల్లలకు ఉద్యోగాలు రావాలన్నా నేను నేరుగా దరఖాస్తు పట్టుకుని మోడీ గారి దగ్గరికి వెళ్లే సత్తా ఉన్నవాడిని కాబట్టి మల్కాజ్గిరిలో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరుతున్నాను.

## దూకుడు పెంచిన కేటీఆర్

అంటూ విమర్శించారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలుచేశారు. ఎంపీగా బండి సంజయ్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. పదేళ్ల నిజం కేసీఆర్, పదేళ్ల విషం బీజేపీ, వంద రోజుల అబద్ధం కాంగ్రెస్.. అని మోసాలతో గెలిచారంటూ విమర్శించారు.

బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే కాంగ్రెస్ హామీలు అమలవుతాయని.. కేసీఆర్ తెలంగాణ రాజకీయాలను శాసించే రోజులు మళ్లీ వస్తాయని కేటీఆర్ చెప్పారు. సోమవారం కేటీఆర్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ప్రచారం నిర్వహించారు. సిరిసిల్లలో నిర్వహించిన ప్రచారంలో కేటీఆర్ మాట్లాడుతూ.. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం పేదల రక్తం పీల్చి కోట్లాది రూపాయలు వసూలు చేసిందన్నారు.

పెట్రోల్, డీజిల్‌పై పన్నుల రూపంలో గత పదేళ్లలో రూ.30 లక్షల కోట్లు వసూలు చేశారని.. వ్యాపార వర్గాలకు రూ.14.5 లక్షల కోట్లు రుణమాఫీ చేశారని ఆరోపించారు. తాను చెప్పింది తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బీజేపీకి సవాల్ విసిరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను 10 నుంచి 12 సీట్లలో గెలిపిస్తే 6 నెలల్లో కేసీఆర్ రాష్ట్రాన్ని శాసించే స్థితికి వస్తారంటూ కేటీఆర్ జోస్యం చెప్పారు.

# బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి భారీ రోడ్ షో.. పాదయాత్ర...

- రోడ్ షో కు వేలాది గా తరలివచ్చిన పట్టణ వాసులు

**జయభేరి, ఎల్.బీ.నగర్ :**



మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా.. సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని చైతన్యపురి డివిజన్ లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఎల్బీనగర్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి. BRS పార్టీ శ్రేణులతో కలిసి, వాడ వాడలా తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ... చైతన్య పురి డివిజన్ లో దిల్ సుఖ్ నగర్ సంతోషిమాత టెంపుల్ నుంచి భవాని నగర్, విద్యుత్తు నగర్, హనుమాన్ నగర్, ఇంద్రనగర్, న్యూ ఇంద్రానగర్, బాపు కాంప్లెక్స్ కొత్తపేట చౌరస్తా మీదుగా మారుతి నగర్, న్యూ మారుతి నగర్, సత్యా నగర్ క్రాస్ రోడ్ వరకు పాదయాత్ర గా సాగిన ర్యాలీ. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుంచిన కేసీఆర్ దేశంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచారు. ఎన్నో సంక్షేమ పథకాలు పెట్టారు. ఎక్కడా లేనివిధంగా ఎల్బీనగర్లో కనివిని ఎరుగనిరీతిలో అభివృద్ధి హైదరాబాదులో జరిగింది. ఐదు సంవత్సరాల కింద కల్లబొల్లి మాటలు చెప్పి రేవంత్ రెడ్డి మల్కాజిగిరిలో ఎంపీగా గెలిపిస్తే ఏ ఒక్కరోజు మల్కాజిగిరి పార్లమెంటుకు రాలేదు. ప్రజల సమస్యలు పట్టించుకోలేదు, హైదరాబాద్ లో వరదలు వస్తే కూడా రాలేదు. ఇప్పుడు సీఎం అయిన తర్వాత కూడా ఒక్క మంచి పని చేయలేదు. నిధులు కేటాయించలేదు కొడంగల్ కు మాత్రం 3500 కోట్లు నిధులు కేటాయించారు. వారంటీ లేని వారు గ్యారెంటీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలకు అన్యాయం చేశాడు. ఫ్రీ కరెంట్ ఇవ్వలేదు 500 సిలిండర్ ఇవ్వలేదు, నేను ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు కాలేదు. కరెంటు పోతుంది, తాగునీళ్లు రావడం లేదు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒకటి నెరవేర్చలేదు.. నేను స్థానికుడిని ఆశీర్వదించండి మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని ప్రార్థన. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, రవి, BRS ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.





## నివేదిత సాయన్న గెలుపు ఖాయం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కంటోన్మెంట్:**

కంటోన్మెంట్ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిక సాయన్న గెలుపు ఖాయం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తిరుమల గిరి లోని చిన్న కమేల లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు గ్యారంటీలను అమలుకు నోచుకోలేదని కాలయాపన చేస్తూ సమయం గడుపుతున్నారని, గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిగా నిలిపివేయబడ్డాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ సమయం నుండి గత 20 ఏళ్లుగా ఎంతో పటిష్టమైన పార్టీ నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకుందని పార్టీ కోసం కష్టపడి పనిచేసి నిస్వార్థంగా సేవలందించే గొప్ప నాయకత్వం బీఆర్ఎస్ పార్టీలో ఉందని అన్నారు. నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు కంటోన్మెంట్ లో మరోసారి గులాబీ జెండా ఎగరడం పక్క అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, HB కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్ రెడ్డి, BRS పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్, ఆకుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈటెల గెలుపు ఖాయం

- బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి




**జయభేరి, మే 6:**

మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందర్ గెలుపు ఖాయమని బిజెపి జిల్లా అద్యక్షుడు విక్రమ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ లో బిజెపి మండలాధ్యక్షుడు నందాల శ్రీనివాస్ ఆద్వర్యంలో వివేకనందా విగ్రహం నుంచి ప్రదాన చౌరస్తా వరకు బిజెపి కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ది శ్రీనివాస్, జిల్లా అద్యక్షుడు విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ఈటెల రాజేందర్ స్థానికంగా ఉంటూ ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాడని చెప్పారు. ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందరు కమలం పువ్వు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపిగా గెలిచిన తర్వాత స్థానిక సమస్యలను పరిష్కరించడానికి ఈటెల కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ మాధవరావు, జిల్లా ఉపాద్యక్షుడు ఉదయ్ కుమార్ , జిల్లా నాయకురాలు హైమా రెడ్డి, జిల్లా బిజెవైఎం కార్యదర్శి సాయిబాబుగౌడ్, మండల ప్రదాన కార్యదర్శులు మల్లెపల్లి నాగరాజు, తప్పెట్ల నరేందర్, ఎల్లం రమేష్, నాగరాజు, నరేందర్రెడ్డి, విజయలక్ష్మి, వేణు, దప్పు రతన్, లగిశెట్టి అర్జున్, గుగ్లావత్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు గొడుగులు

- సంజీవనీ హాస్పిటల్ యాజమాన్యం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటుచేసిన సంజీవనీ హాస్పిటల్ యాజమాన్యం పేద ప్రజల ఆరోగ్య సంరక్షణార్థం అనేక విన్నూత్న సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుంది. అందులో భాగంగానే నేడు దేవరకొండ పట్టణంలో రహదారి పై చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే చిరు వ్యాపారులు ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతల తీవ్రత వల్ల పడుతున్న ఇబ్బందులు గమనించి డా. కృష్ణ, వడ్త్య దేవేందర్ నాయక్ యంపీపి జాన్ యాదవ్ తో కలిసి గొడుగులు, చల్లటి నీటి బాటిళ్లను పంచి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం కావున ప్రస్తుతం వాతావరణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల తీవ్రత వల్ల పేద ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అదేవిధంగా సంజీవని హాస్పిటల్ యాజమాన్యం నిరంతరం పేద ప్రజలకు సేవ చేయడంలో ఎప్పుడు ముందుంటుందనే విషయాన్ని తెలియజేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్య సిబ్బంది నాగ, నందు, సాయి, రమేష్, ప్రసాద్, కృష్ణ, వెంకటయ్య, బావోజీ, మురళి, మంజూరు తదితరులు పాల్గొన్నారు.





## ప్రధానిగా మోడీ హ్యాట్రిక్ విజయం ఖాయం

- మేడ్చల్ జిల్లా బిజెవైఎం కార్యదర్శి సాయిబాబు గౌడ్

**జయభేరి, మే 6:**

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం లో దేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్లిందని, ఇతర దేశాలు సైతం భారతదేశం వైపే చూస్తున్నాయని మేడ్చల్ జిల్లా బిజెవైఎం కార్యదర్శి సాయిబాబా గౌడ్ అన్నారు. ప్రధానిగా మోడీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని వారు ధీమా వ్యక్తంచేశారు. అదేవిధంగా మల్కాజ్ గిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ గెలుపు కూడా ఖాయమని వారు స్పష్టంచేశారు. అటు దేశ ప్రజలు, ఇటు రాష్ట్ర ప్రజలు సైతం బీజేపీ వెంటే ఉన్నారని తెలిపారు.

## పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం పిఆర్సి 2023 కమిటీ సభ్యులం దరినీ కలవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మారం జగదీశ్వర్ మీడియాతో ఈనాటి ముఖ్య అంశాలు తెలియజేశారు. మెడికల్ ఇన్వాల్యుడేషన్ పై రిటైర్ అయిన ఉద్యోగుల పిల్లలకు కంపెన్సేట్ అపాయింట్మెంట్ పై వెంటేనే ఆదేశాలు జారీ చేయాలని, కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీం ఎత్తివేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ లో పని చేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులర్యస్ చేయాలని మెరుగైన పిఆర్సి ఇవ్వాలని, హెల్త్ కార్డు అన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో వర్తింపజేయాలని పి.ఆర్.సి.కమిటీ చైర్మన్ శివశంకర్ ని కోరడం జరిగింది. దీనిపై పిఆర్సి కమిటీ సభ్యులు అందరూ సానుకూలంగా స్పందించి అతి త్వరలో ప్రభుత్వ ఉద్యోగులు అన్ని సమస్యలు సానుకూలంగా పరిష్కరించబడతాయని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముజీబ్, కేంద్ర సంఘ నాయకులు కస్తూరి వెంకట్ , ముత్యాల సత్యనారాయణ గౌడ్, కొండల్ రెడ్డి, సిటీ యూనియన్ అధ్యక్షులు కే. శ్రీకాంత్, డ్రైవర్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# అడిగింది ఇచ్చుకో అడ్డగోలుగా కట్టుకో

- కండ్లకోయలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు..
- అధికారులు, ప్రజాప్రతినిధుల ఆశీస్సులతో రెచ్చిపోతున్న నిర్మాణదారులు..
- మున్సిపల్ ఆదాయానికి భారీగా గండికొడుతున్న అక్రమార్కులు..



**జయభేరి, మేడ్చల్ :**

అడ్డగోలు నిర్మాణాలకు మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని కండ్లకోయ అడ్డాగా మారింది. ఇక్కడ భవనం నిర్మాణం చేయాలంటే అధికారులు, ప్రజాప్రతినిధుల ఆశీస్సులు ఉంటే చాలు నిబంధనలతో పనిలేదన్న విషయం బహిరంగ రహస్యమైపోయింది. భావన నిర్మాణ దారులు మున్సిపల్ కార్యాలయంలో కొందరిని ప్రసన్నం చేసుకుంటే చాలు నిర్మాణాలకు సెట్ బ్యాకులు వదలకున్నా, అంతస్తులు పెంచేసినా అంత మామూలే అన్నట్లుగా మారిపోయింది. దీంతో చాలా మంది నిర్మాణదారులు రెండు అంతస్తుల భవనానికి అనుమతులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా మూడు, నాలుగు అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. కండ్లకోయ సమీపంలో పలు ఇంజనీరింగ్ కళాశాలలు ఉండటంతో ఇక్కడ చదువుకునే విద్యార్థుల వసతి కోసం హాస్టల్ వ్యాపారం లాభసాటిగా ఉండటంతో కొందరి కన్ను ఇక్కడ పడింది. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు హాస్టల్ భవనం కోసం ఇష్టానుసారంగా అనుమతులకు మించి అస్తుల నిర్మాణాలు చేస్తున్నారు. దింతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షించే అధికారులు ఇప్పటికైనా వాటిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**అధికారుల చర్యలు ఎక్కడ..?**

మున్సిపాలిటీ పరిదిలోని కండ్లకోయలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సరైన అనుమతులు లేకుండా పరిమితికి మించి అంతస్తుల్లో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కొందరికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధికారుల తీరుతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇళ్లు, అపార్టుమెంట్ లు, ఇతరత్రా నిర్మాణాలు, పాత ఇళ్లపై అదనపు అంతస్థుల నిర్మాణానికి, దుకాణ సముదాయాలకు టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఆయా కేటగిరీలకు నిర్ణీత మొత్తంలో ఫీజులను చలానా రూపంలో చెల్లించాలి. అంతస్థులనుబట్టి భవనం చుట్టూ (సెట్ బ్యాక్) కొంత స్థలం వదిలిన తరువాతే నిర్మాణాలు చేపట్టాలి. కానీ టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులను ప్రసన్నం చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నారు. అధికారుల తీరుపై జిల్లా మరియు హెచ్.ఎం.డి.ఎ అధికారులు స్పందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి**

మున్సిపల్ అధికారులు, సిబ్బంది తమ జేబులు నిండితే చాలు అన్న విధంగా ప్రవర్తిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన వారు వాటిని ప్రోత్సహిస్తుండడంతో రోజుకో కోత్త నిర్మాణం ప్రారంభమవుతుందనడం అతిశయోక్తి కాదు. అక్రమార్కులు పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. ఆదాయాన్ని పెంచాల్సిన వారే గండికోడుతుండడం మరోవైపు సామాన్య ప్రజలపై మాత్రం పన్నుల భారం మోపుతున్నారని వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.






## బీఆర్ఎస్ పార్టీని వీడి.. కాంగ్రెస్ పార్టీలో చేరికలు

▸ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీకి చెందిన వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు సోమవారం క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైస్ చైర్మన్ మొహమ్మద్ రహమత్ అలీ, మొహమ్మద్ రయీస్, మొహమ్మద్ తౌఫిక్ ఖాద్రి, మూడవత్ జయప్రకాష్ నారాయణ నాయక్, గోపాలదాసు చెన్నయ్య, పాలేపు మల్లేశ్వరి అశోక్, కో ఆప్షన్ సభ్యులు జింకల లింగయ్య, వివిధ వార్డులకు చెందిన బిఆర్ఎస్ పార్టీ ప్రముఖులు, యువకులు అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ... ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గ నుండి కాంగ్రెస్ పార్టీకి అత్యధిక అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే బాలునాయక్ కోరారు. నల్గొండ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్ రెడ్డి చేయి గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించి పార్లమెంటుకు పంపాలని, రాహుల్ గాందీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే వారిని, పాత కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ దేవరకొండ నియోజవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు,అన్ని విభాగాల అధ్యక్షులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ మంత్రం పఠిస్తున్న పార్టీలు



**జయభేరి, హైదరాబాద్, మే 6:**


గత ఎన్నికలకు భిన్నంగా ఈసారి లోక్‌సభకు బీసీ నినాదం ఊపందుకుంది. పార్టీ ఏదైనా బీసీ అభ్యర్థికి ఓటువేయాలనే చర్చమొదలైంది. నలుగురు బీసీలు కలిసినా, శుభ, అశుభకార్యం ఏదైనా బీసీకి ఓటువేయాలని, సత్తాచాటాలని భావిస్తున్నారు. మూడు పార్టీలు కలిపి 14 మందికి టికెట్లు ఇవ్వడం తొలిసారి. ఇందులో బీఆర్ఎస్ పార్టీ 6 గురికి టికెట్లు ఇవ్వగా, బీజేపీ5 గురికి, కాంగ్రెస్ 3 గురికి టికెట్లు ఇచ్చింది. ఒక్కో నియోజకవర్గంలో పార్టీలో ఇద్దరు బీసీలకు కేటాయించినా వారికి మద్దతుగా నిలవాలని బీసీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ‘బీసీల ఓట్లు... బీసీలకే’ అనే నినాదంతో ముందుకు సాగబోతున్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది.రాష్ట్రంలో జనాభాలో 54 శాతం మంది బీసీలు ఉన్నట్లు సమగ్ర సర్వే పేర్కొంటుంది. అయితే రాజకీయంగా మాత్రం వెనుకబాటుకు గురవుతున్నారు. పార్టీలు రాజకీయప్రాతినిధ్యం కల్పించడంలేదని బీసీ నేతలు పేర్కొంటున్నారు. అయితే ఏ ఎన్నికలు వచ్చినా బీసీలకు తక్కువ సీట్లే కేటాయిస్తున్నాయి. దీంతో కొంత నారాజ్‌గా ఉన్నారు. అయితే ఈసారి ఐకమత్యం చాటేందుకు సిద్ధమవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాని బీసీ చర్చ లోక్‌సభ ఎన్నికల్లో మొదలైంది. ఏ పార్లమెంటు సెగ్మెంట్‌లో బీసీ పోటీ చేస్తున్నారో వారికి మద్దతుగా నిలువాలని భావిస్తున్నారు. అందుకోసం కసరత్తును ప్రారంభించారు. కమ్యూనిటీల వారీగా సమావేశాలు నిర్వహించి బీసీకే మద్దతు అంటూ ఏకగ్రీవ తీర్మానం చేస్తుండటం గమనార్హం. అంతేకాదు ఎక్కడ బీసీ అభ్యర్థి పోటీ చేస్తున్నా వారికే ఓటువేయాలని ఫోన్ మెసేజ్‌లు, ఫోన్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్.కృష్ణయ్య పోరాటం కొనసాగించగా, బీసీల పక్షాన ఈటల రాజేందర్ సైతం నిలిచారు. అదే విధంగా బీసీ హక్కుల సాధన కోసం, వారిని ఏకతాటిని తీసుకొచ్చేందుకు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోరాటం చేశారు. 93 కులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన నేతగా గుర్తింపు పొందారు. 20 ఏళ్ల క్రితం బీసీల ఐక్యతకోసం, సమస్యలపై ఉద్యమించారు. ఆ కులాలకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. ముదిరాజ్ మహాసభ జాతీయ అధ్యక్షుడిగా కాసాని కొనసాగుతున్నారు. అంతేకాదు ఆయన బీసీ హక్కులపై పోరాటం చేసేందుకు, సబ్బండ వర్గాలు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు సమస్యలపై పోరాటానికి 2007లో ఏకంగా ‘మనపార్టీ’ని స్థాపించి హక్కులపై ఉద్యమించారు. అయితే ప్రస్తుతం బీసీల్లో వస్తున్న చైతన్యం కాసాని ఉద్యమ ఫలితంగానే అని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నారు. ముదిరాజ్ సమస్యలతో పాటు బీసీల సమస్యలపైనా నీలం మధు ముదిరాజ్ నినదిస్తున్నారు. బండి సంజయ్, ధర్మపురి అరవింద్, బూర నర్సయ్యగౌడ్ సైతం బీసీల హక్కులు, ఉద్యోగుల హక్కుల సాధనతో పాటు బలహీన వర్గాల సమస్యలపైనా నిరంతరం గళం వినిపిస్తున్నారు.బీసీ సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రస్తావించేందుకు, పోరాడేందుకు యువ నేతలు సైతం సిద్ధమవుతున్నారు. అందులో భాగంగానే ఇప్పటికే దూదిమెట్ల బాలరాజుయాదవ్, కాసాని వీరేశ్ ముదిరాజ్, పల్లె రవికుమార్ గౌడ్, రామారావు ఇలా పలువురు బీసీ నినాదంతో ముందుకు సాగుతున్నారు. చేవేళ్ల, భువనగిరి, కరీంనగర్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, హైదరాబాద్ పార్లమెంటు స్థానాల్లో బీసీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరి గెలుపునకు యువత అంతా కృషి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రత్యేక గ్రూపులు సైతం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మోటివేషన్ చేస్తున్నట్లు సమాచారం. బీసీ అభ్యర్థుల గెలుపును భుజన వేసుకుని ముందుకు సాగుతున్నారు. ఏదీ ఏమైనప్పటికీ గతానికి భిన్నంగా లోక్ సభ ఎన్నికల సమయంలో బీసీ నినాదం ఊపందుకోవడం శుభ పరిణామమని పలువురు బీసీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

# సిపిఐ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించండి



**జయభేరి, దేవరకొండ :**

కార్మిక, రైతు,ప్రజా,వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజల మధ్య చీలికలు చేస్తున్న మతతత్వ బిజెపిని ఓడించాలని,పార్లమెంట్ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీ ఉండదని, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎస్ ఎల్ బి సి , డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయకుండా కేసీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసారని సీపీఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని శివసాయి గార్డెన్ లో జరిగిన సీపీఐ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులు ఇప్పటికీ, ఎప్పటికి క్రమశిక్షణ గలవారని,ఎవరెన్ని ప్రలోభాలు పెట్టిన అధికారం లేకపోయినా ఎక్కడున్నా ఒక్కడున్నా ఎర్రజండా ఎగురుతూనే ఉంటుందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చాం విజయం సాధించామని అన్నారు.కాంగ్రెస్ హామీలు అమలు చేయడంలో చిత్తశుద్ధితో ఉన్నామని ప్రభుత్వం ఇప్పటికి చెబుతుందని ప్రభుత్వం వచ్చి 5మాసాలు మాత్రమే అయిందని ప్రజలు బీజేపీ, బిఆర్ఎస్ మాటలు పట్టించుకోకుండా సీపీఐ పార్టీ బలపరిచిన నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.రైతు రుణమాఫీ ఆగష్టు 15 లోపు పూర్తి చేస్తామని ఇప్పటికే సీఎం హామీ ఇచ్చారని,ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేయాలనీ ప్రజల పక్షాన కమ్యూనిస్టులుగా చిత్తశుద్ధితో ఉంటామని తెలిపారు. బీజేపీ, ప్రధాని మోదీ మిత్రులను కాపాడుకోవడానికి ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా అప్పజేపుతున్నారని అన్నారు ప్రజల సంక్షేమం కొరకై, మోదీ ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడేందుకు కాంగ్రెస్ తో పని చేస్తున్నామని అన్నారు.



పదవుల కోసం ఆరాట పడకుండా ప్రజల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీకి మద్దతు కాంగ్రెస్ పార్టీకి ఇచ్చామని సీపీఐ శ్రేణులు గెలుపుకై పనిచేయాలన్నారు.బీజేపీ ని నిలువరించేందుకు గత ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి మద్దతిచ్చామని,కేసీఆర్, ఎస్ ఎల్ బి సి డిండి లిఫ్ట్ ను 10 ఏళ్ల పాలనలో చేయలేకపోయారు.కేసీఆర్ మద్దతిచిన రోజు కూడా నల్లగొండ జిల్లా సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయాలనీ డిమాండ్స్ కేసీఆర్ వద్ద పెట్టాం.హామీ ఇచ్చారు. ఉప ఎన్నికల్లో గెలిశాక మాట తప్పారని కేసీఆర్ కుట్రలను ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. ఎన్నికల బాండ్ ల రూపంలో డబ్బులు తీసుకున్న వాళ్ళు బీజేపీ పార్టీ వాళ్లే,లిక్కర్ స్కామ్ లో ఢిల్లీ సీఎం, ఉప ముఖ్యమంత్రిని జైల్లో పెట్టడం అప్రజాస్వామ్యమని,మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ పనిచేస్తుందని అన్నారు.గతంలో రవీంద్ర కుమార్ పార్టీ వీడి పోయిన నిజమైన కార్యకర్తలు మారలే. కమ్యూనిస్ట్ పార్టీలు తోక పార్టీలు కావు. గెలుపు ఓటములను నిర్ణయించే పార్టీలు.
బీజేపీ సైతం ప్రాంతీయ పార్టీలతో అధికారంలోకి వచ్చింది.కొన్ని రాష్ట్రాల్లో బీజేపీ మనుగడే లేదన్నారు. రాముని పేరుతో ఓట్ల రాజకీయం బీజేపీ చేస్తుందని, దేవుళ్ళ పేరుతో రాజకీయం చేయడం సబబు కాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని సంపూర్ణంగా మద్దతిచ్చాం.ఉప ముఖ్యమంత్రి బట్టి సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి మద్దతు కోరగా క్షేత్ర స్థాయిలో మల్లి కలిసి పనిచేయాలని తెలపగా అందుకు సుముకంగా ఉన్నామ్.స్థానిక సంస్థల్లో కమ్యూనిస్ట్ లకు ప్రాధాన్యం ఇవ్వాలని కచ్చితంగా చెప్పాము.కాంగ్రెస్ పార్టీ కూడా వలసలకు ప్రాధాన్యం ఇవ్వవలసిన అవసరం లేదని అన్నారు.సీపీఐ పార్టీ ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని, పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి గెలుపుకై సీపీఐ శ్రేణులు పనిచేయాలని కోరారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పార్టీ బలం కచ్చితంగా తెలుస్తుందని శాఖ లేని ప్రతి గ్రామములో పార్టీ జండాలను ఎగరవేయాలని నాయకత్వం ఏర్పాటు చేయాలని కోరారు.జానారెడ్డి కమ్యూనిస్ట్ వ్యతిరేకి కాదని,కచ్చితంగా కమ్యూనిస్టులకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు.మోదీ ప్రజా వ్యతిరేక పాలనకు చరమ గీతం పాడాలని, బిఆర్ఎస్ పార్టీకి నమ్మి మళ్ళీ ఓటు వేయొద్దని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జానారెడ్డి,ఎమ్మెల్యే బాలు నాయక్, పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి,సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన అధ్యక్షులు కలకొండ కాంతయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి.మైనోద్దీన్, బొడ్డుపల్లి వెంకటరమణ, తూం బుచ్చిరెడ్డి, కనకాచారి, రంగా రెడ్డి, జయరాములు, వెంకటయ్య, శైలేష్, విజేందర్ రెడ్డి, రామస్వామి, వెంకట్రాములు, ఆంజనేయులు, వెంకటేశ్వర రావు, మండల జిల్లా నాయకులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల ఉనికి పోరాటం



**జయభేరి, న్యూఢిల్లీ, మే 6:**

సుత్తి, కొడవలి గుర్తుతో ఎన్నో పోరాటాలు చేసిన కమ్యూనిస్టు పార్టీ.. ఇప్పుడు సుత్తి, కొడవలి గుర్తు కోసమే పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్ట్ ఉద్యమాలన్నీ ‘ఎరుపు రంగు, సుత్తి, కొడవలి, నక్షత్రం’ గుర్తుతోనే జరిగాయి. రష్యన్ విప్లవం తరువాత, సోవియట్ యూనియన్‌కు చెందిన ఈ చిహ్నం.. ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన అనేక కమ్యూనిస్ట్ పార్టీల గుర్తుగానూ మారిపోయింది. భారత్‌లోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) గుర్తు కూడా అదే సోవియట్ చిహ్నం నుండి తీసుకున్నారు. సీపీఎం గుర్తులో ఉండే కొడవలి రైతులను సూచిస్తే, సుత్తి కార్మికులను, నక్షత్రం విప్లవం, కమ్యూనిస్ట్ భావజాలాన్ని సూచిస్తుంది. అయితే, ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఈ గుర్తు సీపీఎంకు దక్కకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి. సీపీఐ ఇటీవలే జాతీయ పార్టీ హోదాను కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ‘సీపీఎం’కు సైతం ఇదే గండం వెంటాడుతోంది.భారత్‌లో ఒకప్పుడు బలంగా ఉన్న కమ్యూనిస్ట్ పార్టీలు ఇప్పుడు క్రమంగా మరుగున పడుతున్నాయి. 2004లో వామపక్షాలకు లోక్‌సభలో 59మంది ఎంపీలు ఉండగా, ఇప్పుడు ఐదుగురు మాత్రమే ఉండటం గమనార్హం. పశ్చిమ బెంగాల్, త్రిపురలోనూ తమ పట్టును కోల్పోయాయి. వామపక్షాల నేతృత్వంలోని ప్రభుత్వం ఇప్పుడు కేరళలో మాత్రమే ఉంది. కమ్యూనిస్ట్ పార్టీ మొదటి ఎన్నికల నుండి భారతదేశంలోని ప్రధాన పార్టీలలో ఒకటిగా ఉండేది. ఏ రాష్ట్రంలోనైనా కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొదటి పార్టీగా కూడా నిలిచింది. కమ్యూనిస్టు పార్టీ చీలిక తర్వాత 1964లో సీపీఎం ఏర్పడింది. ఇది క్రమంగా లెఫ్ట్ బ్లాక్‌లో అతిపెద్దదిగా మారింది. 2004వరకు ఎన్నికల్లో ప్రభావం చూపించిన సీపీఎం.. 2009 నుంచి 2019 మధ్య పశ్చిమ బెంగాల్, త్రిపురలో క్రమంగా పట్టు కోల్పోయింది.2009 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం పశ్చిమ బెంగాల్‌లో 26, కేరళలో 12, తమిళనాడు, త్రిపురలో రెండేసి, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి సహా 43 స్థానాలను గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో పార్టీ దేశవ్యాప్తంగా 5.66శాతం ఓట్లను సాధించింది. 2009 నాటికి సీపీఎం లోక్‌సభ స్థానాలు 16కు తగ్గాయి. బెంగాల్‌లో తొమ్మిది, కేరళలో నాలుగు, త్రిపురలో రెండు, తమిళనాడులో ఒక సీటు గెలుచుకుంది. కానీ, ఓట్ల శాతంలో (5.33%) మాత్రం అంతగా తగ్గుదల కనిపించలేదు. ఇక, 2014 లోక్‌సభ ఎన్నికల్లో, సీపీఎం కేవలం తొమ్మిది స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. కేరళలో ఐదు, బెంగాల్, త్రిపురలలో రెండు సీట్లు. అయితే, ఈసారి ఆ పార్టీ ఓట్ల శాతం 3.6శాతానికి పడిపోయింది. ఇక, 2019 ఎన్నికల్లో సీపీఎంకు కోలుకోలేని దెబ్బపడింది. లోక్‌సభకు కేవలం ముగ్గురు ఎంపీలను మాత్రమే పంపగలిగింది. తమిళనాడు నుండి ఇద్దరు అభ్యర్థులు, అధికారంలో ఉన్న కేరళ నుండి ఒకరు మాత్రమే. బెంగాల్, త్రిపురలలో లోక్‌సభలో సీపీఎం ఎంపీల సంఖ్య జీరోగా మారింది. 2004లో 5.66% ఉన్న ఓట్ల శాతం 2019 నాటికి 1.75%కి పడిపోయింది.2024లోక్‌సభ ఎన్నికలు సీపీఎంకు మనుగడ కోసం పోరాటంలా మారాయి. జాతీయ పార్టీ హోదా పోకూడదంటే, సీపీఐ పరిస్థితి రాకూడదంటే సీపీఎం మరిన్ని సీట్లు సాధించి, ఓట్ల శాతాన్ని పెంచుకోవాల్సి ఉంది. లేదంటే, తమ పార్టీ గుర్తు కోల్పోయే ప్రమాదం ఉంది. జాతీయ పార్టీ హోదా కోల్పోకుండా ఉండాలంటే (లేదా పొందాలంటే) కనీసం నాలుగు రాష్ట్రాల్లో ఆ పార్టీకి రాష్ట్ర పార్టీగా గుర్తింపు ఉండాలి. లేదా దేశంలోని కనీసం మూడు రాష్ట్రాల్లో ఆ పార్టీ 2శాతం చొప్పున ఓట్లు పొందాలి. లేదా సార్వత్రిక ఎన్నికల్లో(అసెంబ్లీ లేదా లోక్‌సభ) నాలుగు అంతకంటే ఎక్కువ రాష్ట్రాల్లో 6శాతం ఓట్లు.. వేర్వేరు రాష్ట్రాల నుంచి కనీసం 4 ఎంపీ సీట్లు సాధించాలి. ఇతర ప్రమాణాలు ఎలా ఉన్నా.. సీపీఎంకి లోక్‌సభలో నాలుగు ఎంపీ సీట్లు మాత్రం లేవు. ప్రస్తుతం ముగ్గురు సభ్యులు మాత్రమే ఉన్నారు. తమిళనాడు నుంచి ఇద్దరు, కేరళ నుంచి ఒకరు ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్లలో ఆ పార్టీకి 1.77శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. 25.97శాతం ఓట్లు రాగా, తమిళనాడులో 2.38శాతం ఓట్లు వచ్చాయి.సీపీఎంకు జాతీయ పార్టీ హోదా ప్రమాదంలో పడిన నేపథ్యంలో ఆ పార్టీ నేతలు అప్రమత్తమయ్యారు. ఈ ఎన్నికల్లో ఆ ప్రమాదం నుంచి గట్టెక్కాలనే పట్టుదలతో ఉన్నారు. ‘‘ఈ ఎన్నికల్లో వామపక్షాలకు అధికారిక గుర్తు( కొడవలి, సుత్తి, నక్షత్రం) ఉంది. దాన్ని కాపాడుకోవాలంటే పార్టీకి నిర్దిష్ట ఓట్ల శాతం లేదా ఎంపీలు ఉండాలి. లేని పక్షంలో ఎన్నికల సంఘం ఇచ్చే గుర్తులపైనే పోటీ చేయాల్సి ఉంటుంది’’ అని సీనియర్ నాయకుడు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఏకే బాలన్ ఇటీవలే వెల్లడించారు. కాగా, సీపీఎంకు ఎదురైన ఈ అస్తిత్వపు ముప్పు పార్టీ చరిత్రలోనే ఇదే తొలిసారి. ఈ ప్రమాదం నుంచి బయటపడేందుకు తమ ఏకైక కంచుకోట అయిన కేరళలో ఓటు షేరింగ్‌ను పెంచుకోవడంపై దృష్టి సారించింది. పరిమిత ప్రభావం ఉన్న ప్రాంతాల్లో వామపక్ష స్వతంత్రులను రంగంలోకి దింపడం వంటి మునుపటి వ్యూహాల మాదిరిగా కాకుండా, సీపీఎం ఇప్పుడు కేరళలోని 20 లోక్‌సభ స్థానాలకుగానూ 15స్థానాల్లో తమ అధికారిక గుర్తుతో పోటీ చేసింది. ఇది తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి తోడ్పడుతుందని సీపీఎం భావిస్తోంది. రెండో దశ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా గత నెల 26న కేరళలోని మొత్తం 20 స్థానాలకూ పోలింగ్ జరిగింది. వీటి ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.



ఐపీఎల్17 మొదటి అంకంలో భారీ స్కోర్లతో రెచ్చిపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండో దశలో మాత్రం నిరాశజనక ప్రదర్శనలతో తడబడుతోంది. ప్లేఆఫ్స్ రేసులో ప్రతీ మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో ఓడి నాకౌట్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. వాంఖడే వేదికగా ముంబైతో మ్యాచ్‌లో బ్యాట్‌తో విఫలమైన ఎస్‌ఆర్‌హెచ్.. బంతితోనూ తేలిపోయింది. లక్ష్య ఛేదనలో ముంబై విధ్వంసకవీరుడు సూర్యకుమార్ యాదవ్ సూపర్ సెంచరీతో ఆ జట్టు ఓదార్పు విజయాన్ని అందుకుంది.

# రైజర్స్‌కు సన్ స్ట్రోక్

సూర్యకుమార్ సూపర్ సెంచరీ

హైదరాబాద్‌కు ముంబై షాక్

ఎస్‌ఆర్‌హెచ్ ప్లేఆఫ్స్ అవకాశాలు క్లిష్టం!

సన్‌రైజర్స్ హైదరాబాద్ మరోసారి చెత్తప్రదర్శనతో చేతులెత్తేసింది. ప్లేఆఫ్స్ రేసులో ఉన్న ఎస్‌ఆర్‌హెచ్.. వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఓడింది. బంతితో హైదరాబాద్‌ను 173 పరుగులకే కట్టడిచేసిన ముంబై.. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్ (51 బంతుల్లో 102 నాటౌట్, 12 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపు సెంచరీకి తోడు తిలక్ వర్మ (32 బంతుల్లో 37 నాటౌట్, 6 ఫోర్లు) రాణించడంతో 17.2 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 173/8 పరుగుల వద్దే ఆగిపోయింది. ట్రావిస్ హెడ్ (30 బంతుల్లో 48, 7 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ పాట్ కమిన్స్ (17 బంతుల్లో 35 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) హైదరాబాద్‌ను ఆదుకున్నారు. సూర్యకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.
మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్‌కు హెడ్ దూకుడుతో శుభారంభమే దక్కింది. ఐదు ఓవర్లకే 50 పరుగుల మార్కును దాటిన ఎస్‌ఆర్‌హెచ్ తర్వాత గాడి తప్పింది. తన శైలికి భిన్నంగా నెమ్మదిగా ఆడిన అభిషేక్ శర్మ (11)ను బుమ్రా ఔట్ చేసి వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. మిడిల్ ఓవర్స్‌లో ముంబై స్పిన్నర్ చావ్లా, సారథి హార్దిక్ పాండ్యా హైదరాబాద్‌ను దెబ్బకొట్టారు. అర్ధసెంచరీకి రెండు పరుగుల దూరంలో ఉండగా హెడ్‌ను చావ్లా ఔట్ చేయగా నితీశ్ (20)ను హార్దిక్ పెవిలియన్ చేర్చాడు. చావ్లా 13వ ఓవర్లో క్లాసెన్ (2) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. షాబాజ్ (10), జాన్సెన్ (17) నిరాశపరిచారు. ముంబై బౌలర్ల దూకుడుతో హైదరాబాద్ స్కోరు 150 పరుగులైనా చేస్తుందా..? అని అనిపించినా ఆఖర్లో కమిన్స్ రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో పోరాడగలిగే స్కోరు చేసింది.
లక్ష్య ఛేదనలో ముంబై కూడా తడబడింది. ఇషాన్ కిషన్ (9), రోహిత్ శర్మ (4), నమన్ ధీర్ (0) 4 ఓవర్లలోపే పెవిలియన్ చేరారు. కానీ సూర్యతిలక్ ద్వయం ముంబైని లక్ష్యం దిశగా నడిపించింది. ఈ ఇద్దరూ ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగడంతో లక్ష్యం కరుగుతూ వచ్చింది. ఈ జోడీని విడదీయడానికి కమిన్స్ బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. 30 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసిన సూర్య ఆ తర్వాత దూకుడు పెంచాడు. తిలక్ కూడా వీలుచిక్కినప్పుడల్లా బంతిని బౌండరీ లైన్ దాటించాడు. అర్ధ సెంచరీ తర్వాత 20 బంతుల్లోనే మిగిలిన 50 పరుగులను పూర్తిచేసిన సూర్య సెంచరీతో పాటు మ్యాచ్‌నూ ముగించాడు. నాలుగో వికెట్‌కు ఈ జోడీ అజేయంగా 143 పరుగులు జోడించింది.

**సంక్షిప్త స్కోర్లు**

హైదరాబాద్: 173/8 (హెడ్ 48, కమిన్స్ 35 నాటౌట్, హార్దిక్ 3/31, చావ్లా 3/33).
ముంబై: 17.2 ఓవర్లలో 174/3 (సూర్య 102 నాటౌట్, తిలక్ 37 నాటౌట్, భువీ 1/22, కమిన్స్ 1/35)



# రాత్రుల్లు నిద్రించేందుకు ఇబ్బంది పడితే..

వేసవిలో అంత ఈజీగా నిద్ర రాదు. రాత్రుల్లు సరిగా నిద్రపట్టదు. అయితే కొన్ని చిట్కాలు పాటిస్తే ఈజీగా నిద్రపట్టేస్తుంది. వాటి గురించి తెలుసుకోండి.

వేడి కారణంగా అంత ఈజీగా నిద్ర రాదు. రాత్రి బెడ్ మీద ఒక పక్కన పడుకుంటే.. అటువైపు చెమటతో తడిసిపోతుంది. ఇది చికాకు కలిగిస్తుంది. మెలకువ వచ్చేలా చేస్తుంది. అందుకోసం చిన్న చిన్న చిట్కాలు పాటించాలి. శరీరంలో అలసిపోతే బాగా నిద్రపడుతుంది. ఇంకా చాలా ఇళ్లలో ఏసీ లేదు. ఫలితంగా ఈ వేసవి రాత్రి హాయిగా నిద్రించడానికి సమస్యలే. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరికీ తగినంత నిద్ర అవసరం. నిద్ర సరిగా లేకపోతే శరీరంలో అనేక సమస్యలు వస్తాయి. బరువు ఇబ్బందులు కూడా చూస్తారు. రోజంతా అలసటగా అనిపిస్తుంది. ఒత్తిడి తగ్గాలంటే రోజుకు కనీసం 7 నుంచి 8 గంటల నిద్ర అవసరమని నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట సరిగ్గా నిద్రపోని వారు చాలా మంది ఉన్నారు. ఫలితంగా మరుసటి రోజు పని చేసే సామర్థ్యం కూడా తగ్గిపోతుంది. గుర్తుంచుకోండి, రాత్రి నిద్రపోకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. దానిలో వేడిని నియంత్రించడానికి మీకు మార్గం లేదు. కానీ ఇతర చిట్కాలు ఉన్నాయి. ఆ విషయంలో ఇక్కడ కొన్ని టిప్స్ మీకోసం ఇచ్చాం..

**బ్రష్ చేయండి**

రాత్రి పడుకునే ముందు క్రమం తప్పకుండా బ్రష్ చేయండి. మీ చర్మాన్ని కూడా జాగ్రత్తగా చూసుకోండి. మీకు ఇష్టమైన నైట్ క్రీమ్‌ను మీ ముఖంపై రాయండి. ఇవి మీకు బాగా నిద్రపోవడానికి సహాయపడతాయి. అలాగే డైరీ రాయడానికి ఇష్టపడితే రాత్రి పడుకునే ముందు రాసుకోవచ్చు. ఇది మీ ఒత్తిడిని చాలా వరకు తగ్గిస్తుంది. ఆందోళన తగ్గుతుంది. మీరు రాత్రి బాగా నిద్రపోతారు.

**వ్యాయామం చేయాలి**

అలాగే పడుకునే ముందు కనీసం 10 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన దూరం అవుతుంది. తర్వాత నెమ్మదిగా ఊపిరి పీల్చుకోండి. మీరు ఇంట్లో కూడా నడవవచ్చు. కానీ గుర్తుంచుకోండి, రాత్రి పడుకునే ముందు ఎప్పుడూ మొబైల్ లేదా ల్యాప్‌టాప్‌ను ఎక్కువగా ఉపయోగించవద్దు. ఇది శరీరం నుండి మెలటోనిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. ఇది నిద్రకు భంగం కలిగిస్తుంది.

**తేలికపాటి భోజనం**

మంచి నిద్ర కోసం ఎల్లప్పుడూ తేలికపాటి భోజనం తీసుకోండి. పడుకునే ముందు కనీసం మూడు నుండి నాలుగు గంటల ముందు తినడానికి ప్రయత్నించండి. రాత్రిపూట చక్కెర, అధిక కొవ్వు లేదా కెఫిన్, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని ఎప్పుడూ తినవద్దు. నిద్రపోయే ముందు ధూమపానం చేయవద్దు. నిద్ర తీవ్రంగా ప్రభావితమవుతుంది. అయితే రాత్రి పడుకునే ముందు పాలు లేదా అరటిపండు తినవచ్చు. ఇది మీకు బాగా నిద్రపోవడానికి సహాయపడుతుంది. ఎందుకంటే ఇందులో ట్రిప్టోఫాన్ ఉంటుంది. ఇది మంచి నిద్రకు సహాయపడుతుంది.

**అరగంట కంటే ఎక్కువ నిద్రించొద్దు**

మధ్యాహ్నం వేళ ఎంత అలసిపోయినా అరగంటకు మించి నిద్రపోకండి. ఆ నిద్ర సాయంత్రం 4 గంటలకు ముందు ఉండాలి. ప్రతిరోజూ ఒక నిర్దిష్ట సమయానికి పడుకోండి. ఇది మీకు బాగా నిద్రపోయేలా చేస్తుంది. శరీరంలో నీరు లేకపోవడం వల్ల నిద్ర సమస్యలు తలెత్తుతాయి. నిద్రకు ఉపక్రమించే ముందు కొన్ని నీళ్లు తాగండి.

**ఇంటి గోడలు తడపండి**

చాలా మంది వేడి కారణంగా నిద్ర సమస్యలు ఎదుర్కొంటారు. అయితే సాయంత్రపూట ఇంటి గోడలను నీటితో తడపండి. వీలైతే ఇంట్లో కూడా నీటిని చల్లండి. కిటికీలు తెరిచి ఉంచండి. రాత్రి 12 గంటలు దాటిన తర్వాత వాతావరణం చల్లబడుతుంది. పడుకోవడానికి ఓ గంట ముందు స్నానం చేయండి. కాస్త ఉపశమనంగా అనిపిస్తుంది.



# బ్రేకప్ అయితే లైట్ తీసుకోండి బాస్..

అదే మీ విజయానికి తొలిమెట్టు

ప్రేమలో విడిపోతే చాలా మంది చేసే తప్పు కుమిలి కుమిలి ఏడ్వడం. బ్రేకప్ అయితే మీ లైఫ్ బాగుపడుతుందని గుర్తించాలి.

విడిపోవడం అనే పదం వినగానే మీకు నిరాశ, విచారం, హృదయం బరువెక్కినట్టుగా ఉండటం సహజం. కానీ విడిపోడవం అనేది కూడా ఒక రకమైన అనుభవం. మిమ్మల్ని విడిపోయేవారు ఎందుకు దూరం చేసుకున్నారు అనే ప్రశ్నలు వేసుకోవాలి. దాదాపుగా ప్రతీ బంధంలో విడిపోవడానికి డబ్బు, ప్రేమ తక్కువ చూపించడం ముఖ్యమైన కారణాలుగా ఉంటాయి. అయితే విడిపోవడం వలన బాధ మాత్రమే కాదు.. కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. విడిపోవడం కొత్త పరిచయాలకు నాంది పలుకుతుంది. వ్యక్తిగత వృద్ధికి దారి తీస్తుంది. విడిపోయిన మొదట్లో బాధ సహజమే. కానీ తర్వాత జీవితంలో కొన్ని సానుకూల విషయాలు జరుగుతాయి. అయితే ఇందుకోసం మీ ఆలోచన విధానం మారాలి. అప్పుడే జిందగీలో బాగుపడతారు.
విడిపోవడం ప్రభావంత మీ గురించి మీరు అంచనా వేయడం ప్రారంభించుకోవాలి. వ్యక్తులతో ఎలా ఉండాలో మీకో ఐడియా రావాలి. సంబంధాలను అంచనా వేయడం మొదలుపెడతారు. ఇది తమను తాము మంచి మార్గంలో తిరిగి ఆవిష్కరించుకునేలా చేస్తుంది. ప్రేమ, దాని ఇతర చిక్కుల నుండి విముక్తి పొంది స్వంత లక్ష్యాలు, కలలు, కోరికలకు ఎక్కువ సమయం, శ్రద్ధను కేటాయించగలుగుతారు. ఇది లోతైన స్వీయఅవగాహన ద్వారా వ్యక్తిగత వృద్ధికి దారితీస్తుంది.
విడిపోయిన తర్వాత మరింత స్వతంత్రంగా మారతారు. ఒంటరిగా, స్వాతంత్ర్యం, స్వయం సమృద్ధిని తిరిగి పొందగలరు. మీ కోసం మీ ఆనందాన్ని కనుగొనడం కూడా నేర్చుకుంటారు. స్వంత వ్యవహారాలపై దృష్టి పెట్టడానికి ప్రయత్నం చేస్తారు. ఇది మిమ్మల్ని మరింత బలంగా చేస్తుంది. ఇది తరువాతి జీవితంలోని పరీక్షలను మెరుగ్గా ఎదుర్కొనేందుకు శక్తినిస్తుంది.
జీవితంలో సంక్షోభం సమయంలో మనకు మద్దతుగా ఎవరు ఉన్నారు అనేది గుర్తిస్తారు. ఎవరు మనవారు.. ఎవరు పరాయివారు అనేది మీకు అర్థమవుతుంది. స్నేహితులు, కుటుంబ సభ్యుల మద్దతుతో మీకు వారితో మంచి రిలేషన్ ఏర్పడుతుంది. ఇటువంటి అర్ధవంతమైన సంబంధాలు వ్యక్తిగత సంబంధాలను బలోపేతం చేస్తాయి. ప్రత్యేకమైన భావోద్వేగ భద్రతను అందిస్తాయి. అంతేకాదు మీతో ఎవరు ఉంటారు అనేది మీకు ఆ విషయంలోనే అర్థమవుతుంది.
విడిపోవడం అనేది జీవితంలో ఒక అధ్యాయానికి ముగింపు, మరొక అధ్యాయానికి నాంది అని గ్రహించండి. ఇది కొత్త అవకాశాలు, సంబంధాలకు తలుపులు తెరవడంలాంటిది. ఓపెన్ హార్ట్ తో అన్నింటిని అంగీకరించాలి. బ్రేకప్ అయిన కాలాన్ని మీరు దాటాలి అంతే. మీ జీవితాన్ని సంతోషకరమైన, ఊహించని అనుభవాలుగా మార్చుకోండి. గతాన్ని వదిలేయండి.. ముందుకు వచ్చే అవకాశాల కోసం అడుగులు వేయండి.
బ్రేకప్ బాధ మహా అయితే.. నెల రోజులు ఉంటుంది.. కానీ జీవితంలో మీరు సాధించే విజయం.. జీవితాంతం కిక్కునిస్తుంది. మిమ్మల్ని వదిలివెళ్లినవారికి మీ సక్సెస్‌తో సమాధానం చెప్పడమే అసలు విజయం. బ్రేకప్ అయిందని బాధలో ఉండిపోక.. లేచి పరిగెత్తాలి. లేదంటే మీ జీవితాన్ని మీరు నాశనం చేసుకున్నవారు అవుతారు.
ప్రపంచంలో విడిపోయిన ప్రేమలు అన్ని గొప్పవే. మీ ప్రేమ కూడా గొప్పదే అని ముందుకైనా సాగాలి. లేదంటే అక్కడే ఆగిపోతారు. ఆగిపోతే.. జీవితం సాగదు. జీవితంలోకి మనుషులు వస్తుంటారు.. పోతుంటారు.. మీకు నచ్చినట్టుగా బతికితేనే లైఫ్ హ్యాపీ..






# ఆసుపత్రిలో 'జాంబీ రెడ్డి' హీరోయిన్



టాలీవుడ్ హీరోయిన్ 'హుషారు', 'జాంబిరెడ్డి' సినిమాల ఫేమ్ దక్ష నగార్కర్ ఆసుపత్రిలో చేరినట్లు తెలుస్తుంది. తనకు ఏమైంది అనే విషయాన్ని బయటపెట్టకుండా ఇన్‌స్టా వేదికగా ఒక పోస్ట్ పెట్టింది ఈ భామ. గత కొన్ని రోజులుగా స్ట్రెచర్‌పై నాకు తెలియని వ్యక్తులతో సర్జరీ గదిలో ఉండటం చాలా కష్టంగా ఉంది. నాకు రెండు సార్లు వెన్నెముకపై అనస్థీషియా ఇచ్చారు. దాని నుంచి కోలుకోవడం చాలా కష్టంగా ఉంది. నేను నా భావోద్వేగాలన్నింటినీ కంట్రోల్ చేసుకోడానికి ప్రయత్నించాను. నన్ను ప్రేమించే వ్యక్తులు నాకు సపోర్ట్ గా నిలిచారు. కష్ట సమయంలో మనిషిని ఎలా ప్రేమించాలో చూపించారు. ప్రేమకు నిజంగా కనిపించని గాయాలను నయం చేసే శక్తి ఉంది. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. దయచేసి మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోండి. నేను సంతోషకరమైన విషయాలనే పోస్ట్ చేస్తున్నాను, ఎందుకంటే ఎవరూ బాధపడకూడదు కాబట్టి అని తెలిపింది.



# ఇండియన్ సినిమా రూపురేఖలు మార్చే 'కల్కి'



ప్రభాస్ 'కల్కి 2989 ఏడీ'లో తాను నటిస్తున్నట్టు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని తేల్చి చెప్పేశారు టాలీవుడ్ హల్క్ రానా. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ భారీ పాన్‌ఇండియా సినిమాలో అమితాబ్, కమల్‌హాసన్, దీపికా పదుకొణే, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. వీళ్లతోపాటు రానా కూడా ఇందులో ముఖ్యభూమిక పోషిస్తున్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. వీటిపై తన తాజా ఇంటర్వ్యూలో వివరణ ఇచ్చారు రానా. 'నేనూ, డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఇద్దరం ఒకటో తరగతి నుంచీ ఫ్రెండ్స్. పైగా తను నా తొలి సినిమా 'లీడర్'కి శేఖర్ కమ్ముల దగ్గర అసిస్టెంట్‌గా పనిచేశాడు. మా ఇద్దరి అనుబంధం ఈనాటిది కాదు. అందుకే విదేశాల్లో జరిగిన 'కల్కి' ప్రమోషన్స్‌లో పాల్గొన్నాను. దాంతో ఆ సినిమాలో నేనూ ఉన్నట్టు రాసేస్తున్నారు. నిజానికి 'కల్కి'లో నేను లేను. అయితే ఒక్కటి మాత్రం చెప్పగలను. 'కల్కి' సామాన్యమైన సినిమా కాదు. ఈ సినిమాతో ఇండియన్ సినిమా రూపురేఖలు మారనున్నాయి. 'ఎవెంజర్స్' స్థాయి సినిమా అవుతుంది' అని చెప్పారు రానా.



# బాత్ పిక్

తెచ్చిన తంటామనకు పెద్దగా కనిపించని విషయం.. పక్క వాళ్లకు భూతద్దంలో కనిపించవచ్చు. అందుకే మన చర్యల పరిణామాలను ముందుగా పసిగట్టి జాగ్రత్త తీసుకోవాలి. ఈ విషయంలో కొందరు సినీ సెలబ్రిటీలు వీక్. తొందరపడి పోస్టులు పెట్టేయడం, తర్వాత నాలిక కరుచుకోవడం. చాలామంది విషయంలో ఇది పరిపాటైపోయింది. నిరంతరం వార్తల్లో ఉండే స్టార్ హీరోయిన్ సమంత.. టవల్ కట్టుకొని ఇన్ఫ్రారెడ్ ఆవిరి బాత్ చేస్తున్న పిక్ ఒకటి తాజాగా పోస్టు చేసింది. ఆ పోస్ట్‌లో ఈ బాత్ వల్ల కలిగే ప్రయోజనాలను కూడా రాసింది. ఏమనుకుందో ఏమో.. అంతలోనే పోస్ట్‌ను డిలీట్ చేసేసింది. అయితే ఈ కొద్ది సమయంలోనే ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. కొందరు ఆకతాయిలైతే సమంత పోస్ట్ చేసిన పిక్‌ను మార్ఫింగ్ చేసి, ఇబ్బందికరంగా చూపిస్తూ వైరల్ చేశారు. సామ్ అభిమానులేమో ఒరిజినల్ పిక్‌ను వైరల్ చేస్తున్నారు. ఏదేమైనా మొత్తంగా బూమరాంగ్ అయ్యింది. ఈ నేపథ్యంలో సమంత పరోక్షంగా స్పందిస్తూ.. 'మిమ్మల్ని మీరు సమర్థించుకోవాల్సిన అవసరం లేకుండా.. నిరూపించుకోవాల్సిన అవసరం రాకుండా జీవించడమే నిజమైన విజయం' అనే కొటేషన్‌ని పోస్ట్ చేసింది. ఈ పిక్‌పై జరుగుతున్న రాద్ధాంతానికి ఫుల్‌స్టాప్ పెట్టడానికే సామ్ ఈ క్యాప్షన్ షేర్ చేసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# 'సత్య'.. ఇంట్రెస్టింగ్‌గా ట్రైలర్

తమిళ నటులు అమరేశ్, ప్రార్థన సందీప్ జంటగా నటించిన తాజా చిత్రం 'రంగోలి'. వాలీ మోహన్‌దాస్ దర్శకత్వంలో కె బాబు రెడ్డి, జి సతీష్ కుమార్ నిర్మించిన ఈ సినిమా తమిళంలో మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఇదే సినిమాను తెలుగులో 'సత్య' అనే పేరుతో సీనియర్ ఫొటో జర్నలిస్ట్ శివ మల్లాల శివమ్ మీడియా పేరుతో చిత్రనిర్మాణ సంస్థను స్థాపించి తొలి ప్రయత్నంగా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. మే 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ప్రతి తండ్రి తన కొడుకుకు ఏమిద్దామా అని ఆలోచించే సొసైటి మనది. అలాంటి సొసైటిలో నా వల్ల అమ్మానాన్నలు ఇబ్బంది పడకూడదు అని ఆలోచించే కొడుకు కథతో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఇక ఫాదర్ సెంటిమెంట్‌తో వస్తున్న ఈ ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంది. మరోవైపు ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ 'యు' సర్టిఫికెట్‌ను అందజేసింది.

# తగ్గేదే లే.. ప్రియమణి..!



ఎవరే అతగాడు సినిమాతో తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై మెరిసింది ప్రియమణి. పెళ్లైన కొత్తలో సినిమాతో మంచి బ్రేక్ అందుకుంది. ఆ తర్వాత నాగార్జున, జగపతిబాబు, రవితేజ, జూనియర్ ఎన్టీఆర్, గోపీచంద్ లాంటి హీరోలతో సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో నటించింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా ఏ మాత్రం తగ్గేదేలే అనే ఫార్ములాను అప్లై చేస్తోంది. సౌత్‌లో టాప్ స్టార్లతో కలిసి నటించి టాప్ హీరోయిన్‌గా నిలిచింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యా సినిమాలు చేస్తూ దేశంలోనే వన్ ది టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలుగుతోంది. వచ్చే రెండేళ్ల పాటు తన డేట్స్ అన్ని ఫుల్ అయ్యాయంటే ప్రియమణి ఎంత బిజీగా ఉందో అర్థమవుతుంది. ఇక ఓటీటీ సినిమాల విషయానికొస్తే ఈ భామ దర్శకనిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ సెలబ్రిటీగా మారిపోయింది. చివరగా ఓటీటీ ప్రాజెక్ట్ భామాకలాపం 2తో ప్రేక్షకుల ముందు కొచ్చిన ప్రియమణి.. తాజాగా మోస్ట్ ఎవెయిటెడ్ అమెజాన్ ప్రైమ్ వీడియో షో ది ఫ్యామిలీ మ్యాన్ 3 షూటింగ్ కూడా మొదలుపెట్టింది. అజయ్ దేవ్‌గన్ నటించిన మైదాన్ సినిమాతో ప్రేక్షకులను పలుకరించింది. ప్రస్తుతం తమిళంలో కొటేషన్ గ్యాంగ్‌లో నటిస్తుండగా.. షూటింగ్ పూర్తి చేసుకుంది. మరోవైపు కన్నడలో Khaimara చిత్రంలో నటిస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ప్రియమణి ది ఫ్యామిలీ మ్యాన్ 3తో ఎలా ఎంటర్‌టైన్ చేస్తుందో చూడాలంటున్నారు సినీ జనాలు. మొత్తానికి పెళ్లికి ముందు పెళ్లి తర్వాత నో రెస్ట్ అంటూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com